క్లుప్తంగా

ఉత్తరాధనతో ముగిసిన ఉత్సవం


గోపాలదాసు

ఆదోని అర్బన్: పట్టణశివారు మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో గోపాలదాసు ఆరాధన ఉత్సతం ఉత్తర ఆరాధన పూజలతో గురువారం ముగిసింది. ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆచార్ ఆధ్వర్యంలో ముందుగా పూజారులు గురురాజా ఆచారి, అక్షయ్ మంగరాయ ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, పూల అలంకరణ, రాఘవేంద్రస్వామి అష్టోత్తర పారాయణం, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోపాలదాసునికి ప్రత్యేక పూల అలంకరణ, అభిషేకం నిర్వహించి మంగళహారతి ఇచ్చారు.

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

దస్తగిరి స్వామి ఉరుసు

గోనెగండ్ల : మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామంలో వెలసిన శ్రీశ్రీ జగద్గురు దస్తగిరి స్వామి ఉరుసు గురువారం వైభవంగా జరిగింది. ఉరుసు మహోత్సవం సందర్భంగా దస్తగిరి స్వామి దర్గాకు ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు మొక్కలు తీర్చుకున్నారు. దర్గాలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


పొలంలోకి దూసుకెళ్లిన కారు

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు .. ఎమ్మిగనూరు మండలం కల్లుగోట్ల గ్రామానికి చెందిన దావీదు, మనవరాలు కృపమ్మతో కలిసి నందవరం మండలంలోని సంజీవపురం గ్రామంలో బంధువు మృతి చెందడంతో మట్టికి వెళ్లారు. మట్టి ఇచ్చి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. అలాగే తెలంగాణ రాష్ట్రం , కొత్తపల్లి గ్రామానికి చెందిన తెలుగు వెంకటేష్ మంత్రాలయం నుంచి కారులో కొత్తపల్లికి బయలుదేరాడు. మార్గ మధ్యలో నాగలదిన్నె సబ్‌స్టేషన్ సమీపంలో అతివేగంగా వస్తూ వెంకటేష్ కారుతో బైక్ వెనుక భాగంలో ఢీకొట్టాడు. అనంతరం కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న దావీదుకు స్వల్ప గాయాలు, కృపమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని స్థానికులు ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు.

తలారిపై కేసు నమోదు

పెద్దకడబూరు : మండల పరిధిలోని హుళికన్వి గ్రామానికి చెందిన తలారి(వీఆర్‌ఏ) తిక్కయ్య, ఆయన కుమారుడు రేణుకారెడ్డి, మరోవ్యక్తి నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు నిందితులు ముగ్గురు కలసి హుళికన్వి, చుట్టుపక్క గ్రామాల రైతులు హెబ్బటం నల్లారెడ్డి, బొంపల్లి ఉసేని, మేకడోణ ఉరుకుందు, పెద్దతుంబళం విశ్వనాథ్, కే.తిమ్మప్ప, చింతలగాని పద్మ, చింతలగాని మారయ్యలకు పంటనష్టం డబ్బులు, పంట బీమా డబ్బులు, కౌలురైతులకు ప్రభుత్వం నుంచి డబ్బులు, పంట పొలాలకు డీ-పట్టాలు, పాస్‌బుక్‌లు ఇప్పిస్తామని చెప్పి వారినుంచి రూ. 4,56,000 వసూలు చేశారన్నాడు. వారికి నకిలీ చెక్కులు, పాస్‌బుక్‌లు, డీ-పట్టాలు ఇచ్చి మోసం చేశారని బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోషకాహార కిట్ల పంపిణీ


టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను అందజేస్తున్న వైద్యులు

ఆదోని టౌన్: పట్టణంలోని పది మంది టీబీ వ్యాధిగ్రస్తులకు గురువారం మధు ఆస్పత్రి సౌజన్యంతో ఒక్కొక్కరికి రూ.వెయ్యి విలువ చేసే పోషకాహార కిట్లను స్థానిక ల్యాబ్ ఆవరణలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు షేకున్‌బాను, శాంతి, సుధాకర్, మనోజ్‌కుమార్, మనీష మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పేద టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే జబ్బు నయమవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లలితమ్మ, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

బతుకు భారం.. ఇళ్లకు తాళం!

- గిట్టుబాటుకాని ఉపాధి పనులు
- ప్రభుత్వం నుంచి ఏ ఒక్క పథకానికి అందని డబ్బు
- గ్రామాలకు గ్రామాలు వలస బాట
- ముసలోళ్లు ఇళ్ల వద్దనే
- పాఠశాలల్లో తగ్గిపోయిన విద్యార్థుల శాతం


పాదలకుంటలో 4, 5వ తరగతి గదిలో తగ్గిపోయిన విద్యార్థుల శాతం


ఇంటికి తాళం వేసి వెళ్లిన దృశ్యం

కౌతాళం: మూడు పూటల తిండిలేక పంటలపై పెట్టిన పెట్టుబడులు రాక చేసుకున్న అప్పులు భారంగా మారడంతో వలసలు తప్పడం లేదంటున్నారు రైతులు, కూలీలు. ఉన్న ఊరిలో పనులు దొరక్క ఇళ్లకు తాళాలు వేసి వలస వెళ్తున్నారు. దీంతో గ్రామాలకు గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. వెంట పిల్లలను కూడా తీసుకెళ్తుడటంతో పాఠశాలలకు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య కూడా భారీగా తగ్గిపోయింది. ఇదిలా ఉంటే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో డబ్బు జమచేసి ఆదుకునేదని, కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదని.. ఎంతో కొంత ఇచ్చినా వలసల బాధ తప్పేదని కూలీలు చెబుతున్నారు.

ఇళ్లకు తాళాలు

మండల పరిధిలోని పాదలకుంట గ్రామంలో జనాభా వెయ్యి కాగా ఇందులో 600 మంది వలస వెళ్లారు. ఇళ్లకు తాళాలు వేసుకుని కొన్ని కుటుంబాలు వెళ్లగా.. కొందరు ఇళ్ల వద్ద వృద్ధులను వదిలి వెళ్లారు. కొంత మంది అయితే కుటుంబంలో ఐదారు మంది ఉంటే అందులో నల్గురు వలస వెళ్లి మిగితా వారు ఇంటి వద్ద ఉంటున్నారు. ఇది పాదలకుంట గ్రామం పరిస్థితి ఒక్కటే కాదు కాత్రికి, లింగాలదిన్నె, డంబలదిన్నె, బాపురం, ఎరిగేరి, సుళేకేరి, బంటకుంట, మండల కేంద్రమైన కౌతాళంలో కూడా బతకడానికి వలస వెళ్లారు.

సగానికి పైగా విద్యార్థులు గైర్హాజరు

కాత్రికి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులు 435 మంది కాగా పాఠశాలకు హాజరవుతున్న వారు 250నుంచి 280వరకు మాత్రమే. ఇక పాదలకుంటలో 90 మంది విద్యార్థులకు గాను 50మంది వస్తున్నారని అక్కడి ఉపాధ్యాయురాలు తెలిపారు. ఇదే పరిస్థితి చాలా గ్రామాల్లో ఉంది. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 13,610మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 2,314మంది మొత్తం 15,924మంది విద్యార్థులు ఉండగా ఇందులో 972 మంది వలస వెళ్లినట్లు ఎంఈఓ శోభరాణి చెప్పారు.

అయితే మండలం నుంచి 2వేలకు పైగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు వెంట వెళ్లారు. దీంతో పాఠశాలల్లో హాజర శాతం చాల వరకు తగ్గింది.

ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి రాలేదు



గతంలో ఉన్న ప్రభుత్వం నుంచి ప్రతి ఎడాది రైతులకు, కూలీలలకు సంక్షేమ పథకాల వల్ల ఏదో ఒక రూపంలో డబ్బులు వచ్చేది. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క రూపాయి కూడ రాలేదు. తల్లికి వందనం కూడా రాకపోవడంతో చాల మంది పిల్లలను తమ వెంట వలస తీసుకుని వెళ్లారు. ఈ ఏడాది మిరప పంటకు పూర్తిగా మద్దతు ధర తగ్గిపోవడం, పత్తి పంట పండి గిట్టుబాటు ధర లేకపోవడం చాల వరకు అప్పుల్లో కురుకుని పోయాం. అప్పుల ఇచ్చిన వారికి కాస్తోకూస్తో లేక కనీసం వడ్డీ అయిన ఇవ్వాలన్న కారణంగా వలస వెళ్తున్నాం. – చాగి చంద్రయ్య

ఆదుకోని ఉపాధి పనులు..

ఉన్న పల్లెటూరులో ఎలాంటి ఉపాధి దొరకక పోవడంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధి కూలీ డబ్బులు రోజు వారిగా రూ.180నుంచి రూ.200 వరకు మాత్రమే వస్తుండడం అది కూడ వారం రోజుల పాటు పనికి పోతే కేవలం నాలుగు రోజులు వేతనాలు పడడం వంటి కారణాలతో వలస వెళ్లడం తప్పడం లేదని రైతులు పేర్కొంటున్నారు. దీనికి తోడు మిరప పంటకు పూర్తిగా ధర తగ్గిపోవడం పంట దిగుబడి రాక పోవడం, పత్తి పంట పండిన సరైన ధర లేకపోవడంతో వ్యవసాయం కోసం చేసుకున్న అప్పులు తీర్చడానికి కూడా వలస వెళ్తున్నారు.

నేను, మా అమ్మ ఇంటి వద్దే ఉన్నాం



నేను మా అమ్మ నీలమ్మ, మా పెద్ద అక్క విజ్జమ్మ, ఇంటి వద్ద ఉన్నాం. మా నాన్న భీమన్న, మా అక్కలు దుర్గమ్మ, శాంతలు వలస వెళ్లారు. ఇక్కడ పనులు లేకనే వలస పోయారు. మాకు అన్నలు లేరు అంతా ఆడపిల్లలమే. ఇంటి ఖర్చుల కోసమే అక్కలు వలస వెళ్లాల్సి వచ్చింది. –హైమవతి,రెండవ తరగతి

అవ్వ వద్ద ఉంటున్నాం



నాన్న నర్సప్ప, అమ్మ అనితలు పనుల కోసం వలస వెళ్లారు. నేను తమ్ముడు చిన్న (రెండవ తరగతి) అవ్వ వద్ద ఉంటున్నాం. మీరు చిన్న పిల్లలు వద్ద అన్నందుకు మేము ఇక్కడ అవ్వ వద్ద ఉండి బడికి పోతున్నాం. –సురేష్, మూడవ తరగతి

వలసలతో వ్యాపారం జరగడం లేదు



పింఛన్‌తో కాలం వెళ్లదిస్తున్నాను. ఇంటి వద్ద చిన్నపాటి బీడి బంక్ పెట్టుకున్నా. రోజుకు రూ.200 నుంచి రూ.300 వరకు వ్యాపారం జరిగేది. ఇప్పుడు అది కూడా లేదు. గ్రామంలో అందరూ వలస వెళ్లడంతో రోజుకు రూ.వంద కూడా కావడం లేదు. ఇలాంటి బీడి బంక్‌కు కూడా జీఎస్టీ వేస్తారంట. ఇది ఎలాంటి ప్రభుత్వమో అర్థం కావడం లేదు. ఇటీవల అధికారులు గ్రామానికి వచ్చి రాసుకుని పోయారు. –ఆకుల మాంతమ్మ

హాస్పిటల్ తనిఖీ

కోసిగి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఈఓ సత్యవతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. మందుల స్టాక్ వివరాలు, రోగులు, కాన్పుల వార్డులోని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోనే కోసిగి మండలం అత్యధికంగా ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. అందులో అత్యధికంగా 18 ఏళ్ల లోపు వాళ్ల కాన్పులను వస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అలాంటి వారికి ప్రసవ సమయంలో చాల కష్టంగా మారుతోందని చెప్పారు. ఏఎన్‌ఎమ్‌లు, ఆశావర్కర్లుతో వైద్యాధికారులు గ్రామాలను పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డాక్టర్ మనోజ్‌కుమార్, డెంటిస్ట్ మౌనిక, పీహెచ్‌ఎన్ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, సూపర్ వైజర్ శ్రీనివాసులు వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి

పెద్దకడబూరు : ఆర్‌ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి సూచించారు. మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో ఉన్న ఆర్‌ఎంపీ ఖలీల్ గర్భిణులకు పశువుల కంటే హీనంగా వైద్యం ఇస్తున్నాడని అందిన ఫిర్యాదు మేరకు విచారణ నిమిత్తం గురువారం గ్రామాన్ని సందర్శించారు. అయితే సంబంధిత ఆర్‌ఎంపీ అందుబాటులో(గ్రామంలో) లేకపోడంతో హెల్త్ సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ తాహెర్, హెల్త్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు మాజీ ఎంపీటీసీ సభ్యుడు యల్లప్ప పాల్గొన్నారు.

ఒక్క హామీ అమలు చేయలేదు


మాట్లాడుతున్న సాగునీటి సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తవుతున్నా రాయలసీమకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని మహర్షి ఫంక్షన్ హాల్‌లో 'రాయలసీమ కరువు-విద్యా, ఉపాధి రంగాల సమస్యలు-కర్తవ్యాలు' అనే అంశంపై పీడీఎస్‌ఓ ఆధ్వర్యంలో రాయలసీమ విద్యార్థుల సదస్సు జరిగింది. సదస్సుకు పీడీఎస్‌ఓ రాష్ట్ర నాయకులు పి.తిరుమలేష్ అధ్యక్షత వహించారు. సదస్సుకు ప్రధాన వక్తగా హాజరైన బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, రాయలసీమలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తామని, రాయలసీమను గ్రీన్‌హబ్ మారుస్తామని కూటమి నాయకులు ప్రచారాలు చేశారన్నారు. అయితే ఇప్పటి వరకూ ఒక్క పనికూడా చేపట్టలేదన్నారు. ఇటు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజనప్పుడు రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీని కేటాయిస్తానని చెప్పి పది సంవత్సరాలు పూర్తయినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండి పడ్డారు. ఏ పార్టీ అయినా ఎన్నికల ప్రచారంలో ఇచ్చే హామీలంతా తమ ఓటు బ్యాంకుని పెంచుకోవడం కోసమేనని ప్రతిసారి స్పష్టమవుతోందన్నారు. ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ డి.గోవిందులు, పీడీఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్, రాయలసీమ జిల్లాల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.




పట్టణంలోని శివ సర్కిల్ వద్ద వినుగొండకు వలస వెళ్లేందుకు క్యూకట్టిన వాహనాలు,గుంటూరుకు వలస వెళ్తున్న నందవరం మండల వ్యవసాయ కూలీలు

కదిలిన వలసబండ్లు

ఎమ్మిగనూరుటౌన్: గ్రామాల్లో దేవరలు, పండుగలు, జాతర అయిపోవడంతో కూలీలు ఉపాధి కోసం వలస బాట పట్టారు. గురువారం రాత్రి కోసిగి, నందవరం తదతర మండలాల నుంచి దాదాపు 8 వాహనాల్లో పల్నాడు జిల్లా వినుకొండకు వలస వెళ్లేందుకు బొలెరో క్యాంపర్ వాహనాల్లో పిల్లా పాపలతో మూట ముల్లె సర్దుకొని పయనమయ్యారు. పట్టణంలోని శివ సర్కిల్ వద్ద కర్నూలుకు వెళ్లే రహదారిపై ఆయా వాహనాలు వరుసగా నిలబెట్టి ఆయా గ్రామాలకు చెందిన వారు తమకు కావాల్సిన సరుకులు, పిల్లలకు కావాల్సిన చిరుతిండ్లను కొనుక్కొని బయలుదేరారు. వినుకొండ ప్రాంతంలో మిరప పంట కోత వుండటం, కూలి అధికంగా వస్తుండటంతో కుటుంబాలతో సహా వెళుతున్నామని కోసిగికి చెందిన వెంకటేష్ తెలిపాడు.

వంద కుటుంబాలు

గోనెగండ్ల : మండల పరిధిలోని ఐరన్‌బండ, గోనెగండ్ల, గంజిహళ్లి, కులుమాల, అగ్రహారం తదితర గ్రామాల నుంచి కూలీలు వలస బాట పడుతున్నారు. ఆయా గ్రామాలకు చెందిన కూలీలు గురువారం దాదాపు 100 కుటుంబాలు గుంటూరు, తెలంగాణ తదితర పట్టణాలకు వలస వెళ్లారు. ప్రస్తుతం గ్రామాల్లో పనులు లేకపోవడం, అధికారులు పనులు చూపకపోవడంతో వలసలు వెళ్తున్నట్లు కూలీలు చెబుతున్నారు.

ఉపాధి కరువై..వలస చేరువై

నందవరం : మండలంలో ఉపాధి కూలీలు లేక, వేతనం గిట్టుబాటు కాక వ్యవసాయ, రైతులు కూలీలు వలసలకు చేరవవుతున్నారు. పొట్టకూటి కోసం తట్టాబుట్ట సర్దుకొని పొరుగు రాష్ట్రాలకు పరుగులు పెడుతున్నారు. వలసల జోరుతో ఊళ్లల్లో జన సందడి ముగబోయింది. మండల కేంద్రం నందవరంతో పాటు గంగవరం, మిట్టసోమపురం, నాగలదిన్నె, ఇబ్రహీంపురం, పోనకలదిన్నె, సోమలగూడూరు తదితర గ్రామాల్లో వ్యవసాయ కూలీలు, రైతు కూలీలు కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లాకు, అలాగే గుంటూరుకు ఎక్కువ శాతం వలసలు వెళ్లారు. చిన్న పిలల్లలను సైతం వెంటబెట్టుకుని వలసలకు వెళ్లుతున్నారు. ఉపాధి పనులు లేక వేతనం గిట్టుబాటు కాకా వలపలు వెళ్తున్నట్లు రామాంజనేయులు, జంబన్న, రామాంజి, వీరేష్, బసవన్న తదితరులు తెలిపారు.

బాల్య వివాహాలను అరికడదాం

కోసిగి: బాల్య విహహాలు అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్త్రీశిశుసంక్షేమ శాఖ సీడీపీఓ నాగమణి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో కిశోర వికాసంపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎమ్‌లతో కలిసి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ భాగ్యలక్ష్మీబాయి, క్యాతాయిని, ఏఎన్ఎమ్ సుజాత, పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనురాధ, రజిత తదితరులు పాల్గొన్నారు.

నందవరం : గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ పుల్లయ్య, సీడీపీఓ సఫరున్నీసా బేగం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాలికల చదువు భవిష్యత్తుకు వెలుగునిస్తుందని ఎంఈఓ-2 రఘునాథ్ అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాఘవేంద్ర, ఏఎస్‌ఓ సూర్యప్రకాష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుచరిత, సుధావతి, నీలమ్మ పాల్గొన్నారు.

వలసలు నివారించండి

ఆదోని రూరల్: కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో వలసలు నివారించాలని, ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌దేశాయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.నారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆదోనిలోని భవసార కళ్యాణ మండపంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీఎల్‌ఆర్‌సీ ఏపీడీ కృష్ణమోహన్, ఆదోని క్లస్టర్ ఏపీడీ లోకేశ్వర్ హాజరయ్యారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ఖాళీ బుట్టలతో ర్యాలీ నిర్వహించారు. అక్కడ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్, జిల్లా ఆఫీస్ బేరర్స్ ఈ.తిక్కన్న, డి.రామాంజనేయులు, బి.నాగన్న, బి.బాలకృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

వైటీపీఎల్‌కు అనుమతులివ్వొద్దు

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు పట్టణంలో యూత్ ఐకాన్స్ పేరిట ఐపీఎల్ తరహాలో వైటీపీఎల్ సీజన్ వన్ నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనికి అనుమతులు నిరాకరించాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. గురువారం పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమాఖ్య నాయకులు డీఎస్పీ ఉపేంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు మహేంద్రబాబు, ఉదయ్, శేఖర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి మొదటి వారం నుంచి డిగ్రీ, టెన్త్, ఇంటర్మీడియెట్, గ్రూప్ 2, కానిస్టేబుల్ పరీక్షలకు విద్యార్థులు, నిరుద్యోగులు సిద్ధమవుతారన్నారు. లీగ్ మ్యాచ్‌లను పరీక్షల ముందు ప్రోత్సహించవద్దని అధికారులను కోరారు. నాయకులు నరసింహారెడ్డి, గోవర్ధన్, హరి, వీరారెడ్డి, రఘు, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించకపోతే ఉద్యమమే

ఆదోని సెంట్రల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే మధ్యంతర భృతి ప్రకటించాలని, లేని పక్షంలో ఉద్యమ బాట పట్టక తప్పదని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు, ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరేంద్ర యాదవ్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రవి, భీమరాజు అన్నారు. గురువారం భోజనం విరామ సమయంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడాతూ 11వ వేతన సవరణ ముగిసి 16 నెలలు గడిచిన 12వ వేతన సవరణ ఊసే లేదన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ప్రహ్లాద్, ప్రసాద్, సుధాకర్, జయరాం, నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శిక్షణ

ఆదోని రూరల్: స్థానిక నాక్ శిక్షణ కేంద్రంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిరుద్యోగులకు పారిశ్రమల వ్యవస్థాపకత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజుల అవగాహన కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు.. ఆర్థిక ప్రణాళిక, బ్యాంకు లావాదేవీలు, ప్రాజెక్టు రిపోర్టు, సిబిల్ రిపోర్టు, బ్యాంకులోఅప్లికేషన్ ప్రాసెస్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శిక్షకులు రామాంజనేయులు, రాజశేఖర్, నాక్ సెంటర్ ఇన్‌చార్జ్ బీజీ ఉలిగన్న తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలి

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి సాంకేతిక రంగాలలో నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని మానవ వనరుల శాఖ అధికారి బాబా ఫకృద్దీన్ అన్నారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆల్ డీజీ టెక్నాలజీ అనే కంపెనీ వారు కళాశాల ప్రిన్సిపల్ మురళీ మోహన్ అధ్యక్షతన విద్యార్థులకు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. 17 మంది విద్యార్థులు చెన్నై ,11 మంది బెంగళూరు క్యాంపస్‌నకు సెలెక్ట్ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు అయ్యప్ప, యుగంధర్ రెడ్డి, వన్నూరు ప్లేస్‌మెంట్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చర్మకారులకు షాపులు కేటాయించాలి

ఎమ్మిగనూరుటౌన్: కులవృత్తిని కొనసాగించుకునేందుకు చర్మకారులకు మున్సిపల్ షాపులు కేటాయించాలని, అదేవిధంగా బీమా సౌకర్యాన్ని కల్పించాలని కేవీపీఎస్ అనుబంధ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుమాల ఆంథోని డిమాండ్ చేశారు. గురువారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. విశ్వకర్మ శిక్షణ కాలనికి ఆరు రోజులకు గాను రోజుకు రూ.500ల ప్రకారం ఇవ్వాలన్నారు. చర్మకారులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని, ఇంటి స్థలాలను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సుమాల రాజు, మహారాజు, గుంటెన్న, కాలేబు, భాస్కర్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిస్తేనే అభివృద్ధి పనులు చేస్తారా?


అధికారులను నిలదీస్తున్న ప్రజా ప్రతినిధులు

గోనెగండ్ల: మండలంలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యేను కలిస్తేనే చేస్తారా? లేకపోతే చేయారా అని వైస్ ఎంపీపీ అలువాల వెంకట్రామిరెడ్డితో పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ టి. నసురుద్దీన్ అధ్యక్షతన, ఎంపీడీఓ మణి మంజరి ఆధ్వర్యంలో గురువారం మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. పీఆర్ఏఈ శివ శంకర్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలానికి రూ.1.27కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే మండలానికి జిల్లా పరిషత్ నిధులు రూ.15లక్షలు ఇస్తామని సీఈఓ చెబుతున్నారన్నారు. అయితే ఆ నిధులతో పనులు చేయాలంటే ఎమ్మెల్యేను కలవాలి, లేకపోతే పనులు జరగవని అధికారులు అంటున్నారని వైస్ ఎంపీపీ అలువాల వెంకట్రామిరెడ్డితో పాటు ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. జిల్లా పరిషత్ నిధులకు కూడా ఎమ్మెల్యేను కలిస్తేనే చేస్తామనడంతో అధికారుల పనితీరుపై ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు.

ప్రజాప్రతినిధులకు సమాచారమివ్వాలి

ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పనులు చేసేటప్పుడు ప్రజా ప్రతినిధులకు సమాచారం అందిచ్చి అందరి సహకరంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారనికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్‌మెంబర్ రావూఫ్, ఈఓఆర్డీ అనంతసేన, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి


వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియామకమైన నజీర్‌అహమ్మద్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు


టి. మురళీనాయుడును అభినందిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు డి.నజీర్‌అహమ్మద్ అన్నారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడిగా నియామకమైన ఆయనను గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, నందవరం మండల అధ్యక్షుడు శివప్పగౌడ్, జిల్లా చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకె శివప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ముగతి విరూపాక్షిరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ డైరెక్టర్ అల్తాఫ్,తారక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల : టి.మురళీనాయుడును నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం ప్రకటించడంతో గురువారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ టీ నసురుద్దీన్, జిల్లా కార్యదర్శి బందెనవాజ్, వైస్ ఎంపీపీ అలువాల వెంకట్రామిరెడ్డి తదితరులు అభినందించారు. కార్యక్రమంలో కన్నూరు సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీలు మద్దయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు తోలు రాముడు, పద్మనాభం, నదిమూల్లా, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ ఆశయాలను సాధిద్దాం

కౌతాళం: నేతాజీ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ దూద్‌బాషా, హెచ్‌ఎం జ్ఞానేశ్వరి అన్నారు. గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరి సయ్యద్ మైనూద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన సదరమ్ క్యాంపు


కొడుకు కిరణ్‌కు పాలు తాపుతున్న తల్లి రాధ


సదరమ్ క్యాంపు నుంచి తమ్ముడిని బయటకు తీసుకొస్తున్న అన్న ఫారూక్

ఆదోని టౌన్: ఆదోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల(ఏరియా) ఆసుపత్రిలో మూడు రోజులపాటు నిర్వహించిన సదరం క్యాంపు ముగిసింది. రోజుకు 200 మంది చొప్పున మూడు రోజుల్లో 600 మందికి వైద్య పరీక్షలు చేశారు. గురువారం సదరమ్ క్యాంపులో దివ్యాంగులు, మానసిక రోగులు, చెవిటి, కంటి జబ్బులతో బాధపడే పింఛన్‌దారులు అనేక ఇబ్బందులు పడ్డారు. నంద్యాల, కర్నూలు ప్రాంతాల నుంచి వైద్య పరీక్షలు, సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఎన్నో వ్యయప్రయాసాలు ఓర్చి రైళ్లు, ఆటోలు, బస్సులు, అద్దె వాహనాల్లో ఆదోనికి చేరుకుని తమ పిల్లలకు పరీక్షలు చేయించుకుని తిరిగి వెళ్తున్నారు. నంద్యాల నుంచి ఆదోనికి రావాలంటే వందలాది కి.మీ. దూరం నుంచి పడరాని పాట్లు పడ్డామని వాపోతున్నారు. ఆటోలు, వాహనాల్లో రూ.4 వేల నుంచి రూ.5 వేల దాకా ఖర్చు అవుతుందని, రైలు, బస్సుల్లో ప్రయాణం రూ.వందల్లో ఖర్చు చేయాల్సి వచ్చిందని చెబుతున్నారు.